క్లుప్తంగా

రచ్చబండ ప్రారంభం



రచ్చబండను ప్రారంభిస్తున్న బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీలో మాజీ సర్పంచ్ బూర్లె రామ్మూర్తి నాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారులు కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు సుమారు రూ.లక్షతో రచ్చబండ నిర్మించారు. రచ్చబండను శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తన తండ్రి రామ్మూర్తినాయుడు సర్పంచ్‌గా చేసిన సేవలకు గుర్తుగా రచ్చబండ నిర్మించి కాలనీ వాసులకు అంకితం చేసినట్లు చెప్పారు. కాలనీ వాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

108 వాహన సేవలపై ఆరా



మందులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి హరిప్రసాద్

ఆమదాలవలస: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గల 108 వాహనాన్ని జిల్లా అధికారి హరిప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. వాహన పనితీరు, మందులను పరిశీలించారు. రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. వర్షాకాలంలో వాహనాన్ని నడిపేటప్పుడు, విధులు నిర్వహించేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈఎంటీ శేఖరరావు, పైలట్ చిన్నారావు ఉన్నారు.

అమ్మవారికి ప్రసాదం నివేదన



వరదపాయసం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సరుబుజ్జిలి: చిన్నపాలెం గ్రామానికి సమీపంలోని ప్రసిద్ధ దంతపురి క్షేత్రంలో గల సోమాలమ్మ తల్లి ఆలయంలో ప్రసాద వితరణ (వరద పాయసం) కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా దంతపురి రాజుల ఆనవాయితీగా అమ్మవారికి వరదపాయసం, గాజులు, సారె, పసుపు కుంకుమ, పట్టు వస్త్రాలను ఆలయ ధర్మకర్త మెండ సూర్యారావు సమర్పించారు. అర్చకులు మావుడూరి కృష్ణారావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నోట్ బుక్స్ పంపిణీ



నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న హెచ్ఎం, అధ్యాపకులు

నరసన్నపేట: ఉర్లాం జిల్లా పరిషత్ స్కూల్‌లో చదువుతున్న 42 మంది ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన నోట్ బుక్స్‌ను హెచ్ఎం హర్షవర్ధన శర్మ గురువారం పంపిణీ చేశారు. త్వరలో పాఠ్యపుస్తకాలు కూడా వస్తాయన్నారు. యూనిఫాం కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్లు నిర్మాణం



కోనేరు వద్ద నిర్మించిన మెట్లు

సారవకోట: మండలంలోని కురిడింగిలోని పంచిరెడ్డి లింగమూర్తికి చెందిన కోనేరు గ్రామస్తులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ కోనేరుకు ఆనుకుని జాతీయ రహదారుల సంస్థవారు మురుగు నీటి కాలువను నిర్మించారు. కోనేరులోకి వెళ్లేందుకు గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. దీనిని గమనించిన కోనేరు యజమాని నగిరికటకం గ్రామానికి చెందిన లింగమూర్తి కొంత ఆర్థిక సహాయాన్ని గ్రామస్తులకు అందించారు. దీంతో గ్రామస్తులు కోనేరు వద్ద మెట్లు నిర్మించుకున్నారు.

పట్టపగలే వెలుగులు



పగలే వెలుగుతున్న వీధి దీపం

సారవకోట: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వీధి దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోనే ఈ విధంగా ఉంటే గ్రామాల్లో ఎటువంటి పరిస్థితి ఉంటుందోనని పలువురు విమర్శిస్తున్నారు.

తీర ప్రాంతానికి..
వరద ముప్పు



పురుషోత్తపురం వద్ద వరదలకు కొట్టుకుపోయిన గ్రోయిన్



పెదమాలపేట వద్ద 2018లో వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్ బృందం (ఫైల్)



అలమాజీపేట వద్ద కోతకు గురైన తీర ప్రాంతం

- కాలగర్భంలో కలిసిపోతున్న భూములు
- ఇప్పటివరకు నష్టపోయిన భూమి 567 ఎకరాలు
- ఆందోళనలో నదీ తీర ప్రాంత వాసులు

సరుబుజ్జిలి: వర్షం పడిందంటే వంశధార, నాగావళి తీర ప్రాంతాల వాసులకు కంటి మీద కునుకు ఉండడం లేదు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఏ క్షణాన వరద ముంచుకువస్తోందనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. ప్రతిఏటా జూలై నుంచి అక్టోబర్ వరకు ప్రతి రాత్రి.. కాల రాత్రిగా ఉంటుంది. నదీతీర ప్రాంతాల్లో కరకట్టల నిర్మాణాలు ముందుకు సాగకపోవడం వల్ల ఏమాత్రం వరదవచ్చినా వెంటనే జనావాసాల్లోకి వరద ప్రవేశించి మనుషులు, పశువుల ప్రాణనష్టంతోపాటు, పంట, ఇళ్ల నష్టాలు కూడా ఏర్పడుతున్నాయి. సరుబుజ్జిలి మండలంలోని పెద్దమాలపేట గ్రామం వరదలు వస్తే సుమారు నాలుగు రోజులు జలదిగ్బంధనంలో చిక్కుకుంటుంది.

ఈ గ్రామాలకు తిప్పలు..

ప్రతిఏటా వంశధార, నాగావళికి వచ్చే వరదలకు సరుబుజ్జిలి మండలంలోని అగ్రహారం, పాతపాడు, తెలికిపెంట, యరగాం, కాగితాపల్లి, పెదమాలపేట, పెద్దసవలాపురం, చినవెంకటాపురం, పాలవలస, పురుషోత్తపురం, అలమాజీపేట, ఫకీర్ సాహెబ్‌పేట గ్రామాలు నష్టాలకు గురవుతున్నాయి. ఆమదాలవలస మండలంలోని నిమ్మతొర్లాడ, కొరపాం, బెలమాం, లొద్దలపేట, ముద్దాడపేట, కలివరం, తొగరాం, పొందూరు మండలంలోని సింగూరు, బొడ్డేపల్లి, బూర్జ మండలంలోని ఖండ్యాం, గుత్తావల్లి, నారాయణపురం గ్రామాల ప్రజలు నష్టపోతున్నారు. ఈ గ్రామాల వద్ద గ్రోయిన్స్లు నిర్మించాల్సి ఉంది.

కరిగిపోతున్న జిరాయితీ..

వరదల సమయంలో తీర ప్రాంతాల్లో ఉన్న జిరాయితీ కోతకు గురవుతుంది. అధికంగా భూములు కలిగిన రైతులు చిన్నకారు రైతులుగా మారుతున్నారు. విలువైన జిరాయితీ భూములు నదీగర్భంలో కలిసిపోతున్నాయి. మిగిలిన భూములు ఇసుక మేటలతో కప్పేస్తున్నాయి. దీని వల్ల ఇసుక మేటలు తొలగించలేక, సాగుచేయలేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటివరకు 567 ఎకరాల జిరాయితీ నదీ గర్భంలో కలిసిపోయినట్లు అధికారిక లెక్కలు తెలియజేస్తున్నాయి.

తీవ్ర ఇబ్బంది పడుతున్నాం



నది వడ్డునే నివసిస్తున్నాం. వర్షం వస్తే వరద వస్తుంది. అప్పటి నుంచి నిద్రలేని రాత్రులు గడుతుతున్నాం. కనీసం రాతికట్టలు కూడా నిర్మించక పోవడం వల్ల విలువైన భూములు, ఇళ్లు కోల్పోతున్నాం. దీనివల్ల ప్రతిఏటా ఇబ్బందులు తప్పడంలేదు.

– బి.మల్లేశ్వరరావు, తెలికిపెంట, సరుబుజ్జిలి మండలం

నియోజకవర్గంలోని నదీ తీర ప్రాంతం వివరాలు ఇలా..

మండలం	తీరప్రాంత విస్తీర్ణం	తీర ప్రాంత గ్రామాలు
సరుబుజ్జిలి	16 కిలో మీటర్లు	14
బూర్జ	14 కిలో మీటర్లు	12
పొందూరు	13 కిలో మీటర్లు	11
ఆమదాలవలస	10 కిలో మీటర్లు	13

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం..

నదీ తీర గ్రామాల వద్ద గ్రోయిన్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తాం.

– వాసుదేవ్, ఈఈ, కరకట్టల విభాగం

కరకట్టలు నిర్మించాలి



కరకట్ట పనులు పూర్తిస్థాయిలో చేస్తే తీర ప్రాంతాల వాసులకు కొంతమేర రక్షణ ఉంటుంది. వరదల సమయంలో నీరు గ్రామాల్లోకి వస్తుంది. దీనివల్ల రోజుల తరబడి నీరు నిల్వ చేరి అంటువ్యాధులకు గురవుతున్నాం. కనీసం గ్రోయిన్లు అయినా నిర్మించాలి.

– ఆర్.రవికుమార్, యరగాం, సరుబుజ్జిలి మండలం

పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ ప్రతినిధి కిశోర్ కుమార్

కొత్తూరు: నూతనంగా వచ్చిన ప్రభుత్వం విద్యారంగంపై దృష్టి సారించకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని యూటీఎఫ్ ప్రతినిధి ఎస్.కిశోర్ కుమార్ అన్నారు. ప్రభుత్వం విద్యారంగం పరిరక్షణకు తీసుకోవాల్సిన కార్యచరణపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేందుకు గురువారం మండలంలోని నివగాం, మెట్టూరు, మాతల, కుంటిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యారంగ పరిరక్షణకు కోసం దశల వారీగా పోరాటాలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసేందుకే ఈ సందర్శన చేస్తున్నట్లు చెప్పారు. జూలై 22 నుంచి సెప్టంబర్ 10 తేదీ వరకు నిర్వహించనున్న పోరాటాలకు ఉపాధ్యాయులు సిద్ధం కావాలని కోరారు. జూలై 22 నుంచి 30 తేదీ వరకు రాష్ట స్థాయి విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు అందివ్వడం జరుగుతుందన్నారు. ఆగష్టు 5 నుంచి 15 వరకు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందివ్వాలన్నారు. ఆగష్టు 20 నుంచి 30 వరకు 3 వేల సంతకాలతో మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలన్నారు. సెప్టెంబర్ ఒకటి నుంచి 10వ తేదీ వరకు ముఖ్యమంత్రికి 50 వేల పోస్టు కార్డులు వేయాలన్నారు. యూటీఎఫ్ రాష్ట నాయకులు దండు ప్రకాశరావు, బోడ శ్రీనివాసరావు, జి.మాధవరావు, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, శొభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

‘చాపర’ ఆశయాలను కొనసాగించాలి



మాట్లాడుతున్న చౌదరి పురుషోత్తంనాయుడు

ఆమదాలవలస: కార్మిక ఉద్యమ నేత చాపర అప్పారావు ఆశయాలను కొనసాగించాలని ఏపీ ఎన్జీఓల సంఘం రాష్ట ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు అన్నారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపం వద్ద వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చాపర అప్పారావు వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో పురుషోత్తంనాయుడు మాట్లాడుతూ కార్మిక చట్టాలు, కార్మికుల ఐక్యత కోసం పాటుపడిన అప్పారావు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్మిక, ఉద్యోగ సంఘాలు ఎన్నో రాయితీలు, హక్కులు అనుభవిస్తున్నాయంటే అప్పారావు వంటి వ్యక్తులు సాగించిన ఉద్యమ పోరాటాల ఫలితమేనని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్, సీనియర్ న్యాయవాదులు చాపర రమేష్, బొడ్డేపల్లి మోహన్ రావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు .

‘ప్రశాంతి’కి హాల్ట్ కల్పించండి



సీసీఎంకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పొందూరు: పొందూరు రైల్వే స్టేషన్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుదల చేసి ఈ ప్రాంత ప్రయాణీకుల చిరకాల కోరికను తీర్చాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ టీవీజీ ప్రసాద్‌ను పొందూరు రైల్వే స్టేషన్ బీజేపీ కన్సల్టేటివ్ సభ్యులు కోరారు. పొందూరు రైల్వే స్టేషన్‌ను సందర్శించిన చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌తో పొందూరు రైల్వే స్టేషన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందించారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను నిలపాలని, పొందూరు-సంతకవిటి రోడ్డులో ఫ్లైఓవర్ నిర్మించాలని, పూరి-తిరుపతి సమయంలో మార్పు చేయాలని, పొందూరు మీదుగా విశాఖకు మరో పాసింజర్ రైలును వేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బీజేపీ నాయకులు కిల్లి శ్రీరామ్మూర్తి, బి.సత్యనారాయణ, లోలుగు సింహాచలం, పేరూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అనుమతులు లేని పాఠశాల గుర్తింపు



ఇంట్లో నిర్వహిస్తున్న పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

కొత్తూరు: మండలంలోని బలద గ్రామంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా 36 మంది విద్యార్థులతో నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలను ఎంఈఓలు శ్రీనివాసరావు, గోవిందరావు గురువారం గుర్తించారు. వెంటనే పాఠశాలను మూసివేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. పాఠశాలలో చదువుతున్న పిల్లలను సమీపంలో ఉన్న బలద ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌ను, సీఆర్ఎంటీకి సూచించారు. ఓ ఇంటిలో అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు సందర్శించినట్లు ఎంఈఓలు తెలిపారు.

పక్కాగా ఎల్‌సీడీసీ సర్వే

నరసన్నపేట: లెప్రసీ కేసులు గుర్తించేందుకు చేపట్టిన ఎల్‌సీడీసీ-24 సర్వేను ఉర్లాం పీహెచ్‌సీ పరిధిలో పక్కాగా నిర్వహించాలని వైద్యాధికారి సుజాత అన్నారు. లెప్రసీ సర్వేపై సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ పరిధిలో 24 టీములు ఏర్పాటు చేశామని, 17,132 మందికి సర్వే చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పీహెచ్‌సీ పరిధిలో 10 కేసులకు మందులు ఇచ్చామని, వారందరూ బాగానే ఉన్నారన్నారు. గతేడాది ముగ్గురిని గుర్తించి వారికి మందులు ఇచ్చామని తెలిపారు. వారందరినీ ప్రాథమిక దశలో గుర్తించి మందులు ఇచ్చామన్నారు. ప్రస్తుత సర్వేలో కూడా కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తిస్తే వారికి కూడా ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

లైంగిక వేధింపులపై కఠిన చర్యలు



సారవకోట: మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంబాబు

సారవకోట: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ రాంబాబు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ పీఓ హెచ్.కామాక్షి అధ్యక్షతన లైంగిక వేధింపులపై ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రతీ సచివాలయం నుంచి ఒక కమిటీ నియమించడం జరిగిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, హోటళ్లు, ఇతర ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు జరిగితే కమిటీ దృష్టికి తీసుకువస్తే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మధుబాబు, ఈఓపీఆర్డీ రేణుక, ఎంఈఓ ఎం.వి.రమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన

పాతపట్నం: పని చేస్తున్న ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులపై అంతర్గత ఫిర్యాదుల కమిటీ (పోష్) చట్టంపై ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో పోష్ చట్టంపై గురువారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ విమలరాణి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళలపై లైంగిక వేధింపులు ఉండకూడదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కల్యాణ్ రామ్, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

అవినీతిని ప్రోత్సహిస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అవినీతిని ప్రోత్సహిస్తే సహించేది లేదని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హెచ్చరించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి అధ్యక్షత జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శాఖల వారీగా సమీక్ష చేశారు. సీతంపేట ఐటీడీఏ, గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగు అధికారులు రోడ్లు, ఇళ్ల నిర్మాణం కోసం అడ్వాన్సులు చెల్లించారని, ఆ పనులు ఎప్పుడు ప్రారంభించి పూర్తి చేస్తారో తెలియజేయాలని ప్రశ్నించారు. పూశాం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని రెండు నెలలుగా ఎందుకు తెరవటం లేదన్నారు.

సెలవులో ఉన్న ఆయాకు జీతం ఎలా ఇచ్చారని అధికారుల తీరును తప్పుబట్టారు. అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలకు అనారోగ్యం బాగా లేకపోవడంతో రెండు నెలలుగా సెలవులో ఉన్నారని కొత్తూరు సీడీపీఓ విమలారాణి తెలిపారు. ఆయా పనిచేసిన కాలానికి మాత్రమే జీతం ఇచ్చామని సీడీపీఓ వివరించారు. లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు 24 గంటలూ అందుబాటులో ఉండటం లేదని సర్పంచ్ ముగడ దివాకర్ సభ దృష్టికి తీసుకువచ్చారు. సభలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను మూడు నెలల తరువాత జరిగే సమావేశం నాటికి పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, వైస్ ఎంపీపీలు శివ్వాల ఇందమ్మ, తలసముద్రం కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదనరావు, ఏఓ పైడి లతశ్రీ, వైద్యులు ప్రియాంక, లక్ష్మీదీప్, పశువైద్యురాలు కవిత, ఉపాధి హామీ పథకం ఏపీఓ శ్రీదేవి, ఈఓపీఆర్డీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర చెరువు ఆక్రమణల గుర్తింపు



ఎర్ర చెరువును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పాతపట్నం: మండల కేంద్రంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఎర్ర చెరువు ఆక్రమణలను గుర్తించి, తొలగించడానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం ఎర్ర చెరువును మండల సర్వేయర్ రామగణపతి ఆధ్వర్యంలో సచివాలయ సర్వేయర్లు కొలతలు చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఐదెకరాల రెండు సెంట్ల విస్తీర్ణంలో చేరువు ఉందన్నారు. చెరువులో కొంత భాగాన్ని కప్పేసి నిర్మాణాలు చేపట్టారన్నారు. మరో రెండు రోజులపాటు కొలతలు ఉంటాయని, ఎంత వరకు అక్రమణలు జరిగాయో గుర్తించి తహసీల్దార్ ప్రసాదరావుకు, ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఆర్ఐ భువన్‌కుమార్, వీఆర్వో పార్థసారధి, జోగారావు, ప్రభాకరరావు, సైలాడ సతీష్, సన్యాసిరావు, మన్మథరావు, అశోక్, చిన్నయ్య, శంకర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

యాంత్రీకరణపై దృష్టి సారించాలి



యంత్రంతో నాట్లు వేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పోలాకి: వ్యవసాయం చేస్తున్న యువ రైతులు యాంత్రీకరణపై దృష్టి సారించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మబగాంలో యంత్రంతో నాట్లు వేసే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ప్రభుత్వం సైతం ఇలాంటి ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరించిన వారికి ప్రోత్సహిస్తుందన్నారు. భవిష్యత్‌లో వ్యవసాయరంగం కొత్తపుంతలు తొక్కుతుందన్నారు. అనంతరం మండల వ్యవసాయశాఖ అధికారి పి.చిరంజీవి ఆధ్వర్యంలో దీనిపై రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదర్శ రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

జలుమూరు: వంశధార నదీ తీర ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సి.హెచ్.నాగమ్మ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. అంధవరం, ఉప్పరపేట, రామకృష్ణాపురం, పర్లాం, దొంపాక తదితర నదీతీర గ్రామాల వద్ద రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఆయా మార్గాల్లో ట్రెంచ్‌లు తీయించేందుకు వీఆర్వోలకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

నరసన్నపేట: కౌమార దశకు చేరిన 8, 9వ తరగతి విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రతపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పడాల చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి సూర్యప్రసాదరావు అన్నారు. స్థానిక జెడ్పీ (బోర్డు) హైస్కూల్‌లో స్వామిబాబు వజ్రమ్మ చారిటిబుల్ ట్రస్టు (ఎస్‌వీసీటీ) ఆధ్వర్యంలో యుక్త వయసు అమ్మాయిల్లో కలిగే శారీరక మార్పులు, పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి వివరించారు. రుతుక్రమం సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెచ్ఎం శ్రీనివాసరావు, ఎస్‌వీసీటీ ప్రతినిధులు రమేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మారు రథయాత్ర

నరసన్నపేట: స్థానిక పెద్దపేటలో గత 11 రోజులుగా కొలువుదీరిన జగన్నాథ స్వామి గురువారం సత్యవరానికి పయనమయ్యారు. శాస్త్రోక్తంగా మారు రథయాత్రను నిర్వహించారు. సత్యవరంతోపాటు, నరసన్నపేటకు చెందిన పలువురు యువకులు రథాన్ని సత్యవరం వరకు లాగారు. ఈ నెల 7వ తేదీన రథయాత్ర ప్రారంభమైంది. సత్యవరం జగన్నాథ స్వామి ఆలయం నుంచి స్వామి పెద్దపేట ఆలయానికి వచ్చారు. బుధవారం వరకు స్వామి వారు వివిధ అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వసనాభి గాంధీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు.

విద్యార్థుల వివరాలు అప్‌లోడ్ చేయాలి

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను (యూడైఎస్ పోర్ట్)ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. గురువారం స్థానిక ఎమ్మార్సీలో సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. బడిబయట పిల్లలు బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో నూతనంగా చేరిన విద్యార్థుల వివరాలు విద్యాప్రవేశ యాక్టివేషన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సీఆర్పీలు ధనుంజయరావు, గోవిందరావు, శ్రీదేవి, చందరరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

సరుబుజ్జిలి: బాల్య వివాహాలు వల్ల పలు అనర్థాలు జరుగుతాయని ఐసీడీఎస్ షళంత్రి సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.జానకి తెలిపారు. మిషన్ సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తకోట జెడ్పీహెచ్‌ఎస్‌లో కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత వల్ల డెంగీ, కలరా, మలేరియా వంటి వ్యాధులను తరిమికొట్టవచ్చునని తెలిపారు. అధ్యాపకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



పాతపట్నం: ర్యాలీ నిర్వహిస్తున్న కోర్టు సిబ్బంది, న్యాయవాదులు



నరసన్నపేట: మాట్లాడుతున్న సివిల్ జడ్జి హరిప్రియ

పాతపట్నం: రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువమంది తలకు బలమైన గాయాలు కావడంతోనే ప్రాణాలు కోల్పోతున్నారని పాతపట్నం బార్ అధ్యక్షుడు బి.ఈ.సత్యనారాయణ అన్నారు. గురువారం న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై కోర్టు కూడలి నుంచి ఆస్పత్రి కూడలి మీదుగా ఆల్‌ఆంధ్ర రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. సీనియర్ న్యాయవాది మెట్ట రామారావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట: నరసన్నపేట కోర్టు ఆవరణలో ద్విచక్ర వాహనదారులకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సివిల్ జడ్జి సి.హరిప్రియ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాది గొండు సత్యనారాయణ, కోర్టు సిబ్బంది, దిచక్ర వాహనదారులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి, బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మి భాయ్ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ సీపాన గోవిందరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండల న్యాయ సేవా సలహా సంఘం ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ జడ్జి కె.రాణి ఆధ్వర్యంలో కోర్టు నుంచి కుర్మదాసుపురం, కొత్తూరులోని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు, కొత్తూరు పోలీస్, సబ్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: హెల్మెట్ వినియోగంపై పొందూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.జ్యోత్స్న ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలీసు, కోర్టు సిబ్బంది, సిస్టం కళాశాల డైరెక్టర్ ఎం.మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.